కథ

-కె.కె.భాగ్యశ్రీ

వాకిట్లో వేపచెట్టు కింద నులకమంచం మీద పడుకున్న వీరయ్యను లేపి వాడి చెవిలో గుసగుసలాడుతూ ఏదో కబురూదింది పేరమ్మ.

అంతే..ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు వీరయ్య.

"నిజంగానా!" ఆనందంతో అతడి ముఖం చింకిచేటంత అయ్యింది.

# సదువుకోరా తమ్ముడా!

సుతారంగా మగడి బుగ్గ పొడుస్తూ "ఇట్టాంటి సమయాల్లో అబద్ధాలాడతారా ఓరన్నా... నే గమ్మునెళ్లి నాలుగు కొబ్బరిమట్టల్దీసుకురా...సావుకారమ్మ నడిగి దాన్నెం...నూలు అట్టుకొత్తాను" హడావుడి పడిపోతూ చెప్పింది పేరమ్మ.

ఈ ఆర్భాటమంతా దేనికంటే...

ముత్తి ఎదిగింది...ఆల్చిప్పలో పడిన స్వాతి చినుకు మంచిముత్యమైనట్లుగా పన్నెండేళ్ల ముత్తి పరువపు పొత్తిళ్లలో చేరి ఆణిముత్యంలా తయారైంది.

ముత్తి అసలు పేరు ముత్యాలమ్మ. అందరి నోళ్లల్లోనూ నాని నాని దాని నామధేయం ముత్తిగా స్థిరపడిపోయింది.

ముత్తి పెద్దదైందన్న విషయం విన్న షావుకారమ్మ ధాన్యం, నువ్వులతో పాటు వాళ్ల అమ్మాయివి పాత లంగా, ఓణీ, యాభై రూపాయలు ఇచ్చింది.

ఆవిడ దయార్ద్ర హృదయాన్ని వేనోళ్ల కొనియాడింది పేరమ్మ.

"అమ్మా!" గుడిసెలో ఓ వారగా ఒదిగి కూర్చున్న ముత్తి పిలిచింది బెరుగ్గా.

ధాన్యాన్ని నేలమీద పలుచగా నెరిపి, కొబ్బరి ఆకులతో అల్లిన చాపను పరుస్తున్న పేరమ్మ "ఏటే" అంది విసుగ్గా.

"మరి...మరి..." నసిగింది ముత్తి.

"ఏటో సెప్పు తల్లీ" ఈసారి నింపాదిగా అడిగింది పేరమ్మ.

"మరి...అయ్యాల సావుకారుగోరి పాప పెద్దదయినప్పుడు...ఆల్లు మైకెట్టించారు గందా! ఇప్పుడు మనింటి కాడ కూడా అట్టా మైకెట్టించవా" ఆశగా అడిగింది ముత్తి.

ప్రకృతి ధర్మానికి అనుకూలంగా ఆడపిల్ల శరీరంలో మార్పులు సంభవించితే దానికింత ఆర్భాటం, పెడబొబ్బలు ఎందుకో అర్థంకాని వెర్రిబాగుల్ది ముత్తి.

ఊరు వాడ హోరెత్తిపోయే విధంగా... మైక్‌సెట్ పెట్టి, చుట్టుపక్కలంతా న్యూసెన్స్ క్రియేట్ చేస్తే..అది చాలా గొప్ప అనుకుంటారు చాలామంది.

రెన్నెళ్ల క్రితం పేరమ్మ పనిచేసే షావుకారుగారి అమ్మాయి రజస్వల అయినప్పుడు వారు మైక్‌సెట్ పెట్టి పాటలు వేసి, ఆహ్వానం కార్డులు ప్రింట్ చేయించి అందరినీ పిలిచి భోజనాలు పెట్టి... చాలా గ్రాండ్‌గా చేశారు ఫంక్షన్.

తల్లికి సహాయంగా ఆరోజు వాళ్లింటికి వెళ్లిన ముత్తి ఈ సంరంభం అంతా దగ్గరుండి తిలకించింది. చుట్టుపక్కల పరిసరాలలో ప్రతిధ్వనిస్తూ... వాతావరణాన్ని హుషారెత్తించేలా మారుమోగుతున్న పాటలను విని తెగ సంబరపడిపోయింది.

అసలు ముత్తికి మైక్‌లో పాటలు వినడం అంటే చాలా ఇష్టం. చిన్నప్పటి నుండీ తమ్ముడిని చంకలో వేసుకొని గుడిదగ్గర వినిపించే పాటల కోసం పరుగులు తీసేది. వాడు ఆ పాటలు విని ఏడుపు మాని సంతోషంతో కేరింతలు కొట్టేవాడు.

పాటల పట్ల అలా మొదలైన అభిరుచి...వయసుతో పాటు రకరకాలుగా ఎదిగింది.

షావుకారుగారింట్లో మైక్‌సెట్‌లో పాటలు విన్నాక...ఎప్పటికైనా తమింటి దగ్గర కూడా అదేవిధంగా పాటలువేస్తే బాగుండునన్న కోరిక మరింత బలంగా వేళ్లూనింది మదిలో.

దాన్ని నెరవేర్చుకునే తరుణం ఇన్నాళ్లకి రావడంతో తల్లిని అడిగింది ముత్తి.

ఆమె మాటలు పేరమ్మ చెవుల్ని తాకాయో లేదో గానీ...కిమ్మనక తన పనిలో తాను నిమగ్నమైపోయింది పేరమ్మ.

తల్లికి వినపడలేదేమోనన్న సందేహంతో మరోసారి రెట్టించి అడిగింది ముత్తి.

అంతే...పేరమ్మ కస్సుమని లేచింది.

"ఏటే? ఏటయినాది నీకు? యిడ్డూరంగా మాటలాడతన్నావు? అసలీ కార్రెం ఎట్టా ఒడ్డెక్కుతుందా బగమంతుడా అని నాను కింద మీద పడతా ఉంటే... మైకెట్టింసాల్నా నీకు... ఈసారన్నావుగానీ ఇంకెపుడూ ఇట్టాంటి ఎర్రిమొర్రి కబుర్లాడమాక..." అంది పేరమ్మ శివాలెత్తిపోతూ..

ముత్తి వదనం చిన్నబోయింది. "నీ... అమ్మెప్పుడూ ఇంతే... ఏటడిగినా కాదనే అంటాది..." అనుకుంది కళ్లల్లో నీళ్లు తిరుగుతూండగా.

మారు మాట్లాడక ఉండిపోయిన కూతుర్ని చూసి పేరమ్మ హృదయం కలుక్కుమంది.

"మాయదారిదాన్ని...పిల్లది సరదాపడి ఏదో అడిగితే, అనొసరంగా కసురుకున్నాను" అనుకుంది పేరమ్మ.

ఇరుగు పొరుగుల సహాయంతో ముత్తిని చాపమీద కూర్చుండబెట్టింది.

తానడిగిన మొదటి కోరికను వెలిబుచ్చి తల్లిచేత చీవాట్లు తిన్న ముత్తి మనసులో ఉద్భవించిన ఇంకొక కోరికను తనలోనే అణిచేసుకుంది.

ఆరోజు షావుకారమ్మ కూతురికి పేరంటంలో కట్టుకున్న బట్టల్లాంటివి తను కూడా ధరించాలన్నదే ఆమె వాంఛ.

ఎర్రని పట్టు లంగా, జాకెట్టు...లేత ఆకుపచ్చ రంగు జరీ అంచు వోణీ కట్టుకుంది ఆ అమ్మాయి ఆ రోజు.

నల్లని నలుపు శరీర ఛాయ...ముఖం నిండా మెత్తిన కుంకుమబొట్టు, మెడంతా అలముకున్న గంధపు చారికలు...ఒంటి నిండా దిగేసిన బంగారు నగలు...

అచ్చం జాతరలో పోలేరమ్మ విగ్రహంలా కనిపించింది ఆ అమ్మాయి ముత్తి కళ్లకి.

"ఆ బట్టలు తనకైతే ఎంత బాగుంటాయి! తారుడబ్బాలా ఉన్న ఆ పిల్లకి అయ్యేం బాగున్నాయి? పగల్నొత్తే రేతిరి కల్లోకి వచ్చేట్లుంది..." అనుకుంది ముత్తి-పససతొన రంగులో ఉన్న తన శరీరఛాయను చూసుకుంటూ.

కోరికలైతే వాటి ప్రమేయం లేకుండా ఉత్పన్నమయినాయిగానీ...అవి తీరే మార్గమే దుర్లభమని ఆ లేత మనసు గ్రహించలేకుండా ఉంది ఆ పసి మనసు.

పేదవారికి కలిగే ఆశలు అందని ద్రాక్షలని, గగన కుసుమాలని తెలుసుకోలేని అమాయకురాలు ముత్తి.

ఆమె వాంఛితాలేమీ నెరవేరకుండానే...తొమ్మిది రోజుల అనంతరం తనకున్నంతలో అట్లబంతి జరిపించింది పేరమ్మ.

అక్కకి సంబంధించిన ఈ సందడిలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాడు ఆ పిల్ల తమ్ముడు చిరంజీవి.

ఎప్పుడూ చెట్టపట్టాలేసుకుని తనతో చెట్లమ్మట, పుట్లమ్మట తిరుగుతూ ఆడిపాడే అక్క...అలా సిగ్గుపడుతూ, స్తబ్ధుగా ఓ మూల కూర్చోవడం వింతగొలిపింది వాడికి.

రెండుమూడు సార్లు ముత్తి దగ్గరకు వెళ్లబోతే అవత

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**



లకి
పొమ్మని కేకలేసింది పేరమ్మ.

అక్కడికీ ఆమె కళ్లు గప్పి మధ్యమధ్యన అక్క దగ్గరకు పోయేవాడు చిరంజీవి. పేరమ్మ వచ్చిన అలికిడి అవగానే బయటకు తుర్రుమనేవాడు.

అట్లబంతి నంబరానికి ముత్తి మేనత్త శివాలమ్మ, ఆమె కొడుకు నన్యాని వచ్చారు. బంగారుబొమ్మలా మెరిసిపోతున్న ముత్తిని చూసి పదిహేడేళ్ల నన్యాని మనశ్శరీరాలు వశం తప్పాయి.

ముత్తికోసమని ఎర్రని అద్దు లంగా, తెల్లని ఓణీ తెచ్చింది శివాలమ్మ.

ఆ బట్టల్లో ముత్తి రాచకన్యలా మెరిసిపోయింది. ఆమె అందం చూసి నన్యాని కళ్లు మెరిశాయి.

నంబరం పూర్తయినాక...తీరుబడిగా కూర్చున్నారు అందరూ.

తమ్ముడి కొడుకు చిరంజీవిని ఒళ్లో కూర్చోబెట్టుకుని "నా చిన్నారి తండ్రేడీ... నా చిట్టి బకాసురుడేడీ..." అంటూ ముద్దులాడసాగింది శివాలమ్మ.

అక్కడే కూర్చుని బియ్యంలో రాళ్లేరుతున్న ముత్తి చివాలున తలెత్తి "ఆడి పేరు బకాసురుడు కాదు బాప్పా...సిరంజీవి...ఆ సిన్మా యాక్టరు 'సిరంజీవి' లేడూ... ఆయన పేరే..." అంది గొప్పగా.

శివాలమ్మ ఆమెకేసి గుర్రుగా చూసి "సాల్సాల్లేవే... పెద్ద సెప్పొచ్చావు. ఈడిది మా నాన్న పేరే... నేనట్టాగే పిలుత్తాను..." అంది మొండితనంగా.

ఎలా పెట్టారో...ఎవరు పెట్టారో తెలియదుగాని వీరయ్య తండ్రిపేరు బకాసురుడు. పేరుకి తగినట్లుగా భారీగా ఉండేవాడు.

తన కడుపున వంశాకురమైన బిడ్డడు పుట్టాడు...ఆ తండ్రి జ్ఞాపకార్థం వాడికి 'బకాసురుడని' పేరు పెట్టాడు వీరయ్య.

ముత్తికి కాస్త జ్ఞానం తెలిసొస్తోంది అప్పుడప్పుడే.

బకాసురుడన్న పేరు కాస్త మోటుగా ధ్వనించింది దాని చెవులకి.

"ఓరయ్యో నువ్వే పేరన్నా ఎట్టుకో... కానీ ఈడిని మా తరం అందరూ 'సిరంజీవి' అనే పిలవాల...అలా ఎవరు పిలవకపోయినా నానొల్లకోను..." అని తెగేసి చెప్పింది.

వీరయ్య కూడా దానికి అభ్యంతరం చెప్పలేదు. "ఏదయినా కానీ... అయ్యే ఈడి రూపంలో పుట్టాడు.." అనుకొని మురిసిపోయేవాడు.

మరచి తప్పున ఎవరన్నా వాడిని బకాసురుడని పిలిచాడో వారిమీద అమ్మోరు తల్లల్లే ఇరునుకు పడేది ముత్తి. దాని నోటికి జడిసి ఎవరూ వాడిని బకాసురుడని పిలవలేదు తిరిగి.

ఇప్పుడు మేనత్త వాడినలా పిలుస్తూంటే కారం రాసుకున్నట్లయ్యింది ముత్తికి.

"ఇదుగో బాప్పా...మళ్లీ ఆడిని ఆ పాడు పేరెట్టి పిలిత్తే ఊరుకొనేది లేదు. ఆ.." అంది హెచ్చరిక చేస్తున్నట్లుగా.


ఈసారి శివాలమ్మ కోపం తెచ్చుకోలేదు. మేనకోడలి వైపు మురిపెంగా చూసింది.

"ఏం రాలిపడతన్నావే గుంటా... ఈ రాలిపాటు ఎట్టా తగ్గింసాల్నో నాకు తెల్దనుకున్నావా? నీకో ముకుతాడేస్తే ఆ పొగరంతా దిగిపోద్ది..." అంది నవ్వుతూ.

ముత్తికి ఆ మాటల్లోని సారాంశం అర్థం కాలేదు.

"ఏటో ఈ బాప్ప...తానోటంటే ఆవిడోటంటాది..." అనుకుంటూ అవతలకి పోయింది బుర్ర గోక్కుని.

శివాలమ్మ వీధి వాకిట్లో మంచానికి నులక పేనుతున్న వీరయ్య దగ్గరగా పోయి "ఒరే తమ్ముడూ... ముత్తి పెద్దదయి



పోనాది...ఇంకెందుకు ఆలీసం? నా కొడుక్కూడా తాపీ పని నేరుసుకున్నాడు. అడపా దడపా కూలికెళ్తూనే ఉన్నాడు. మంచి మూర్తం సూసి ఆళ్లిద్దరికీ ముడెట్టేత్తే ఓ పనైపోతాది... ఏటంటావు?" అడిగింది.

వీరయ్య అయోమయంగా దిక్కులు చూశాడు.

తెల్లముఖం వేసుకుని కూర్చున్న మగడ్ని చూసి పేరమ్మ మనసులోనే "నంగిరి సంతా..." అని తిట్టుకుంది.

పైకి మాత్రం ముఖాన నవ్వు పులుముకుని... "ఏదో దినా...ఇప్పుడే గందా ఇది ఎదిగింది. దాసిన కుసిన్ని పైసలు ఈ సందడికే సరిపోనాయి...పెళ్లంటే మాటలా... బోలెడన్ని పైసలు గవాలా...ఎట్టా సూసినా మేం కాలూ సెయ్యి కూడదీసుకునేసరికి మరో అయిదారేళ్లు పడతాది.. అంతవరకు ఓపిక పడితే మంచిది.." అంది పేరమ్మ సంశయంగా చేతులు నులుముకుంటూ.

శివాలమ్మ ఆడపడుచు హోదా ప్రదర్శిస్తూన్నట్లుగా

ముఖం పెట్టి.

"అయిదారేళ్లే... అప్పటికి నా కొడుకు ముదిరి పోడూ...సర్లే...మరో మూడేళ్లలో పెళ్లికి సిద్ధంకండి. ఇదిగో తమ్ముడూ...దగ్గర సమ్మందం కదాని పెళ్లి తూ..తూ.. మంతరంగా సేత్తే నా నొల్లకోను..." అంది దర్పంగా.

"అట్టాగేనే అప్పా... ఇంకా టయం ఉంది కదా...అప్పుడు సూద్దాం..." అన్నాడు వీరయ్య అక్క వైపు చూసి.

పేరమ్మ గుండెలమీద 'హమ్మయ్య' అన్నట్లుగా చేతులు వేసుకుంది.

శివాలమ్మ, సన్యాసి ఆ పూటే బయలుదేరి వాళ్ల ఊరెళ్లి పోయారు.

* * *

ముత్తికి పదిహేను నిండి పదహారు వచ్చింది. ఒళ్లంతా లావణ్యం రాశి పోసినట్లుగా మెరిసిపోతోంది. వయసు తెచ్చిన వయ్యారాలతో ముత్తి అందం మిడిసిపడుతున్న ట్లుగా ఉంది.

చిరంజీవి కూడా స్కూల్‌కి వెళ్తున్నాడు. రాజాలా యూనిఫాం వేసుకుని స్కూలుకెళ్తున్న తమ్ముడిని చూసి ముత్తి ఎంతో పొంగిపోతోంది.

ఎందుకంటే...ముత్తికి చదువన్నా...చదువుకోవడమన్నా ఎంతో ఇష్టం. పేరమ్మ అయిదేళ్లు నిండగానే ఆమెను స్కూల్లో వేసింది కూడా.

ముత్తి రెండో తరగతి చదువుతూండగా పేరమ్మ చిరంజీవికి జన్మనిచ్చింది. వాడు పుట్టినప్పుడు ఒంట్లో ఏర్పడిన రక్తహీనత కారణంగా పేరమ్మ బాగా జబ్బుపడింది. ఏ పనీ చేసుకోలేని కారణంగా ముత్తిని స్కూలు మానిపించి ఇంట్లోనే అట్టిపెట్టింది.

బడి మానిపించినా సరే... స్కూల్లో, ముత్తికి ఉచితంగా వస్తున్న మూడు కేజీల బియ్యం వదులుకోడానికి ఇష్టపడని పేరమ్మ, టీచరమ్మ కాళ్ల వేళ్ల పడి... బ్రతిమలాడి రోజూ హాజరు వేయమంది.

ఉద్యోగ నిర్వహణలో స్ట్రిక్ట్‌గా ఉండే ఉపాధ్యాయులు ఇటువంటి వేడికోళ్లకి మెత్తబడరు. కానీ పేదరికంతో కొట్టు మిట్టాడే ముత్తిని చూసి...జాలిగుండె గల ఆ టీచరమ్మ దానికి అటెండెన్స్ వేసేది.

ఎప్పుడైనా స్కూల్లో ఏమైనా తనిఖీలు జరిగినప్పుడు, ఎవరైనా అధికారులు వచ్చినప్పుడు తప్ప స్కూలు ముఖం చూసిన పాపాన పోలేదు ముత్తి.

తమ్ముడి ఆలన పాలన చూడడంలోనే గడిచిపోయింది దాని బంగారు బాల్యం అంతా.

వాడిని కనడం వరకే పేరమ్మ బాధ్యత. వాడిని కన్నతల్లి కన్న మిన్నగా సాకేది ముత్తి. వాడంటే దానికి ప్రాణం.

చదువు మీద ఉన్న మక్కువ చావని ముత్తికి తమ్ముడిని ఎలాగైనా గొప్ప చదువు చదివించాలని కోరిక.

అందుకే వాడికి ఏ పనీ చెప్పకుండా, ఏ కష్టమూ కలగనీయకుండా చూసుకుని వాడిని బళ్లో వేసేయమని తల్లి దండ్రులతో చెప్పింది.

"ఎట్టాగూ మగబిడ్డకి సదువు కావాల...పద్దాకా అయినా సదివించితే మంచి కటనం వత్తాది..." అని మొగుడ్ని శతపోరి వాడిని స్కూల్లో వేసింది పేరమ్మ.

ముత్తి మనసు సంబరంతో పరవళ్లు తొక్కింది. చిన్నారి చిరంజీవి స్కూల్ యూనిఫాం తొడుక్కుని రాజాలా బడికి వెళ్తూంటే చూసేందుకు దానికి రెండు కళ్లూ చాలడం లేదు.

ఇప్పుడు చిరంజీవి అయిదో క్లాసుకి వచ్చాడు. చదువులో అందరిలో ముందుండే వాడంటే టీచర్లందరికీ అభిమానమే.

ముత్తికి పదహారు రాగానే శివాలమ్మ మళ్లీ వచ్చింది. పెళ్లి విషయం తేల్చమని ఒత్తిడి చేసింది. వీరయ్య దంపతులు ఆలోచించుకొని...ఎప్పుడైనా తప్పేది కాదని...ముత్తికి పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు.

పెళ్లి కుదరగానే ముత్తిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఎప్పుడో...చిన్నతనంలో మదిలో జనించి, నెరవేరక అణగారిన కోరిక మళ్లీ ఊపిరి పోసుకుంది.

ఈమధ్య వాళ్ల వాడలో ఆ మాత్రం, ఈ మాత్రం పైనున్న వాళ్లందరూ మైక్‌సెట్ పెట్టిస్తున్నారు ఏ సందర్భమైనా సరే.

అందరిదాకా ఎందుకు! ముత్తి చిన్ననాటి స్నేహితురాలు నాగమణి పెళ్లికి మైక్‌సెట్ పెట్టించడమే కాకుండా రంగురంగుల దీపాలు పెట్టారు. సిక్స్టీన్ ఎమ్.ఎమ్. తెర తెప్పించి సినిమాలు కూడా వేశారు.

కనీసం తన పెళ్లి సందర్భంగానైనా తమింటి ముందు మైక్ పెట్టిస్తే బాగుండునన్న వెర్రి ఆశ ముత్తి మనసుని పట్టి ఊపేసింది.

ఆ ఊపున వెళ్లి తల్లిని అడిగేసింది.

ఎప్పటిలాగా పేరమ్మ గంగ వెర్రులెత్తిపోలేదుగానీ ఆలోచనలో పడినట్లుగా ఉండిపోయింది. తల్లి వాలకం ముత్తికి అర్థం కాలేదు.

"నువ్వడిగింది సేయడానికి కనీసం అయిదారొందలన్నా గావాల్నే...అంత సొమ్ము నేనేడ నుండి తేగలను. దగ్గర సమ్మందం అనుకోవడమేగాని... మీ అత్త అయిదేలు కటనం అడిగినాది. అదీగాక పెళ్లికరుసులు...ఏం సేత్తాం... సావుకారమ్మ కాడ అప్పుసేయాల. అయినా పెళ్లికింకా నాలుగు నెళ్లు టయముంది గందా... అప్పుడా లోసిద్దాంనే..." అంది పేరమ్మ నిర్వికారంగా.

మరో మాటకు తావీయక, పాలపొంగుమీద నీళ్లు చిలకరించిన చందానే...తన ఉత్సాహాన్ని నీరుగార్చిన తల్లిని మరేం అనలేక, మనసులోనే మధనపడసాగింది ముత్తి.

అయితే వీరి సంభాషణను చిరంజీవి విన్నాడని వాళ్లకు తెలియదు.

* * *

"ఒరయ్యా...నా కొడకో...ఏటయినాదిరా నీకు..." ఘొల్లుమంది పేరమ్మ.

రాత్రి అన్నం తిని, కులాసాగా వాకిట్లో మంచం మీద వెల్లకిలా పడుకొని ఆకాశంలో అక్కడక్కడ మిణుకుమంటున్న చుక్కల్ని లెఖ్ఖ పెడుతున్న వీరయ్య, గాబు దగ్గర కూర్చొని అంట్లగిన్నెలు తోముతున్న ముత్తి ఆమె గావుకేకలకు లోనికి పరుగెత్తుకొచ్చారు.

పేరమ్మ ఒడిలో పడుకున్న చిరంజీవి తీవ్ర ఆయాసంతో రొప్పుతున్నాడు. చర్మం నల్లగా కమిలిపోయింది. ఒళ్లంతా దురదలు పుడుతున్నాయి కాబోలు... గోళ్లతో బరబర ఒళ్లు గోక్కుంటున్నాడు.

"ఒరే...తమ్మూ...ఏటయినాదిరా నీకు?" అంది ముత్తి వాడిని తడుముతూ. అంతే...షాక్ కొట్టినట్లుగా చేతిని వెనక్కు తీసుకుంది.

వాడి శరీరం కణకణమండే నిప్పులా, అతి వేడిగా ఉంది.


పేరమ్మ గోలుగోలున ఏడుస్తూ "రెండ్రోజులు నుండీ జోరం, తల్నొప్పి వత్తోందంటే... నీళ్లలో నానుంటాడు రొంపసేసిందనుకున్నా... కానీ ఇదేంటిరా బగమంతుడా... దబ్బపండు నాంటి బిడ్డడు బొగ్గు ముక్కనాగయిపోనాడు...అవతల పెళ్లి సూత్తే దగ్గర పడిపోతోంది...ఇవతలీ పిలగాడు ఇట్టా అయిపోనాడు... నానేటి సేతునురో దేవుడో..." అని గుండెలు బాదుకుంది.

"నువ్వుండహె..." అని వీరయ్య ఆమెనో కసురు కసిరి మరాలస్యం చేయకుండా డాక్టర్ దగ్గరకు పరుగుదీశాడు వాడిని తీసుకొని. అతడిననుసరించారు తల్లీ కూతుళ్లు. చిరంజీవిని పరీక్ష చేసి జ్వరం, దురదలు తగ్గడానికి ఇంజక్షన్ చేయించారు.

"మా వోడికి ఏటయినాది బావూ..." అడిగింది పేరమ్మ ఏడుస్తూనే. డాక్టర్ ఆమెను పరిశీలనగా చూసి "మీ వాడిని కూలి పనికి గానీ పంపుతున్నావా? లేక ఏదైనా ఫ్యాక్టరీలో పనికిగానీ..." అనుమానంగా అడిగాడు.

పేరమ్మ తల అడ్డంగా ఊపుతూ "లేదు బావూ...ఆడే కూలికీ పోనేదు. దరజాగా యిస్కూలు బళ్లో అయిదో కలాసు సదూతున్నాడు..." అంది గొప్పగా.

"మరైతే ఇది ఎలా జరిగింది?" ఆలోచనలో పడ్డాడు డాక్టర్.



"ఏటి బావూ!" ఆదుర్దాగా అడిగింది పేరమ్మ.

"ఏంలేదు..ఈ జ్వరం, తలనొప్పి, ఒళ్లు నల్లబడడం, దురదలు ఇవన్నీ చూస్తూంటే... ఏమైనా కెమికల్స్ పడక రియాక్షన్‌గాని వచ్చిందేమోననిపిస్తోంది..." చెప్పాడు డాక్టర్ సాలోచనగా.

"అంటే..." అయోమయంగా చూసింది పేరమ్మ.

"కెమికల్స్ అంటే రసాయనాలు. మనం ఇళ్లల్లో వాడే క్లీనింగ్ ఆసిడ్‌లు.. పురుగుమందులు...పొలాల్లో స్ప్రేచేసే క్రిమిసంహారక మందులు... ఇలాంటివి చర్మం మీద పడినా, లోపలికి పీల్చినా ఇలా జరిగే అవకాశం ఉంది..." తనకున్న పరిజ్ఞానాన్ని ఏకరువు పెట్టాడు డాక్టర్.

"అయ్యన్నీ మాకాడెట్టా వత్తాయి బావూ..." అమాయకంగా అంటూ తెల్లముఖం వేశాడు వీరయ్య.

"ఐ..సీ... దాని సంగతికేం గానీ ఈ మందులు నేను చెప్పినట్లుగా వాడండి. ఫలితం ఉండొచ్చు..." ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి, ఫీజు వసూలు చేసి ఇంటికి పంపాడు డాక్టర్.

డాక్టర్ బాబు ఎందుకలా అడిగాడో, ఎంత ఆలోచించినా పేరమ్మ ప్రభృతులకి బోధపడలేదు. అహర్నిశలూ తమ్ముడి మంచాన్ని అంటిపెట్టుకొని సేవచేస్తోంది ముత్తి. దాని సేవల ఫలితమో... మందుల ప్రభావమో గానీ చిరంజీవి నెమ్మదిగా కోలుకోసాగాడు. వాడి వైద్యం కోసం ముత్తి పెళ్లికోసమని షావుకారమ్మ దగ్గర అప్పు తెచ్చిన డబ్బంతా ఖర్చయిపోయింది.

పెళ్లి చూస్తే వారం రోజుల్లో ఉంది. ఏం చెయ్యాలో తోచక గిలగిల్లాడిపోయింది పేరమ్మ.

* * *

ఆరోజు ముత్తి పచారీకొట్టుకెళ్లి వెచ్చాలు తెస్తూంటే దార్లో స్కూలు టీచరమ్మ కనిపించింది. ముత్తి ఆవిడకి నమస్కరించింది.

"ఏం ముత్తీ పెళ్లటగా..." నవ్వుతూ పలకరించింది ఆవిడ.

సిగ్గుతో తలవంచుకొని "రేపొచ్చే శుక్కరారం అండీ" అంది ముత్తి.

"ఏంటోనే ముత్తీ. మీలో మరీ చిన్నపిల్లకే పెళ్లిళ్లు చేసేస్తారు. అంత పసి వయసులో పెళ్లి చేయకూడదు. అది చట్టరీత్యా నేరం కూడాను..." అని నిట్టూర్చి, ఏదో గుర్తుకు వచ్చినదానిలా "అవునూ...చిరంజీవి ఈ మధ్య స్కూలుకు సరిగ్గా రావడం లేదు. ఏంటి సంగతి?" అని అడిగింది టీచరమ్మ.

"ఆడికీ మధ్య ఒంట్లో బాగాలేదమ్మా..." చెప్పింది ముత్తి విషాదంగా.

"ఆహా! ఏం ఏంటయ్యింది?" ఆరాటం కనబరిచింది టీచరమ్మ. చెప్పింది ముత్తి. వాడి పట్ల జాలి ప్రదర్శించింది టీచరమ్మ.

"ఇప్పుడనే కాదు ముత్తీ. మూడు నెలలై వాడు స్కూలుకి సరిగ్గా రావడం లేదు. ఓరోజు వస్తే ఇంకో నాలుగు రోజులు రావడం లేదు. మధ్యాహ్నం భోజనానికి కూడా రావడం లేదు. మీ ఇంటికి కబురు పెట్టి మాట్లాడదామని అనుకుంటూనే ఉన్నా... కానీ కుదరడం లేదు. ఇంతకీ చిరంజీవి స్కూలుకెందుకు రావడం లేదు?" అడిగింది టీచరమ్మ ఆరాగా.

విషయం విన్న ముత్తి ఆశ్చర్యపోయింది. తనకేమీ తెలియదని, తల్లితో ఈ సంగతి చెప్తానని టీచరమ్మకి చెప్పి ఇంటివైపుకి అడుగులు వేసింది ముత్తి.

నడుస్తోందన్న మాటేగానీ ఆమె మనసు మనసులో లేదు.

"మూన్నెళ్లయి ఇస్కూలుకి పోక ఈడేం సేత్తున్నట్టు? బడి బట్టలేసుకుపోతా ఉంటే... ఆడికే గావాల పోతన్నాడనుకుంటున్నారందరూ...ఇస్కూలుకీ పోక, ఇంటికాడా నేక... ఈడేడకి పోతన్నట్లు?"

ఎన్నో ప్రశ్నలుద్భవించాయి ముత్తి మదిలో.

ఇంటికొచ్చాక సరుకులు గట్టుమీద దింపి చిరంజీవి పడుకున్న మంచం దగ్గరకి వెళ్లింది ముత్తి. అక్కని చూడగానే వాడి కళ్లు మెరిశాయి.

చేతిలోని బిస్కట్ పొట్లాం విప్పి, ఒక బిస్కట్ తీసి వాడి నోటికందించింది ముత్తి.

వాడు బిస్కట్ తింటూంటే తల నిమరుతూ "తమ్ము..నానో ఇసయం గురించి అడుగుతాను. దాసకుండా నిజం సెప్పాల..." అంది లాలనగా ముత్తి.

"అడుగక్కా..." ఈరసంగా పలికాడు చిరంజీవి.

"ఉప్పుడే మీ టీచరమ్మ కనబడ్డాది. నువ్వు...నువ్వు...మూన్నెళ్లై బడికి సరింగా పోడం నేదంట...బడి మానేసి ఎక్కడికెళ్లావురా..." ప్రశ్నించింది నెమ్మదిగా.

చిరంజీవి భయంగా అట ఇటు చూశాడు. దగ్గర్లో ఎవరూ లేరన్న నిర్ధారణకు వచ్చాక "నేను పత్తి తోటలో పనికి పోతున్నా..." అని చెప్పాడు గుసగుసగా.

అదిరిపడింది ముత్తి. "పనికా! పనికి పోవాల్సిన అవసరం ఏటొచ్చినాదీడికి?" ఆ మాటే అడిగింది వాడిని.

"నీకు మైక్‌సెట్ అన్నా, దాన్లోంచి వచ్చే పాటలన్నా ఎంతో ఇష్టం కద అక్కా... నీ పెళ్లికి పాటలు పెట్టించమని అమ్మనడిగితే నిన్ను కేక లేసింది కదా! అందుకే నీ పెళ్లికి మైక్ సెట్ పెట్టించాలని...నేను పనికిపోయినా... ఆ కూలంతా మా తోట యజమాని కాడే దాచిపెట్టా..." చెప్పేడు చిరంజీవి మెల్లగా.

ముత్తి మనసు ద్రవించిపోయింది. "తమ్ముడికింత జబ్బు సేయడానికి ఇదన్నమాట కారణం!?" తన కోసం ఆడెంత పెమాదాన్ని కొని తెచ్చుకున్నాడు..." కళ్లల్లో నీళ్లు గంగలా ఉబికాయి.

చిరంజీవి చెప్పినదంతా ఎక్కడినుండీ విందోగానీ పేరమ్మ విననే వింది. ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తుకొచ్చి "ఓరి నా కొడకో...ఎంత పని సేశావురా... ఈ మాయదారి దాని కోరిక తీరనడానికి నువ్వు పేనం మీదికి తెచ్చుకున్నావురా!" అంటూ లబో దిబో మంటూ శోకాలు తీయడం మొదలెట్టింది.

ముత్తి బెంబేలెత్తిపోయినట్లుగా బెదురు బెదురుగా చూసింది తల్లివైపు.

పేరమ్మ శోకం దారి మళ్లి ముత్తి మీద కోపంగా మళ్లింది.

"ఓసి దెట్ట గుంటా... మైకో...మైకో...అని ఏడ్సి ఆడిని సావుదాకా తీసుకొచ్చావు గదే...

బంగారంలా సదువుకునే గుంటడు నీ పిచ్చి కోరిక మూలంగా పనికిపోయి మంచాన బడ్డాడు గదే...

నీ కల్లు సల్లబడ్డాయా ఇప్పుడన్నా...

నీ పెళ్లి కోసమని అప్పుతెచ్చిన సొమ్మంతా ఈడి రోగం కోసం దారపోశాం గదే...

ఇప్పుడు మళ్లీ అప్పోరిత్తారే...ఈ పూరికొంప అమ్ముకొని మేం ఏ సెట్టుకిందో కాపరం సేయాల...

అంతా నీ వొల్లనే వచ్చింది... మాయదారి ముండా...." అని శాపనార్థాలు పెడుతూ దాని నెత్తిమీద రెండుసార్లు పిడికిలితో మొట్టింది.

ముత్తి కంట్లోంచి బయటకుబుకుతున్న కన్నీళ్లు ఆ గుద్దులకి భయపడి కళ్లల్లోనే ఆగిపోయాయి.

తన చిరకాల వాంఛ, తనెంతగానో ప్రేమించే తమ్ముడినింత దారుణంగా శిక్షించిందని తెలుసుకున్నాక ఆమె ఆక్రోశానికి అంతే లేకుండా పోయింది.

మారు మాట్లాడకుండా బయటకు పోయి, డాక్టర్ బాబు దగ్గరకెళ్లింది ముత్తి.

ప్రత్తి తోటల్లో పురుగులు, మొక్కలకి సోకే తెగుళ్లు, చీడపీడలు నివారించడానికి అడపా దడపా క్రిమిసంహారక మందులను స్ప్రే చేయడం జరుగుతుంది. అలా చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో... ఆ ఘాటు ముక్కులోకి వెళ్లడం, ఆ మందు శరీరంపై చిందడం వంటివి జరిగి, వాటి వలన చర్మ వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత అనారోగ్యాలు కలుగుతాయని ఆమెకి అర్థమయ్యేలా వివరించి చెప్పాడు డాక్టర్ బాబు.

ముత్తి గుండె గుభిల్లుమంది. ఒంట్లో సత్తువనంతా ఎవరో తోడేస్తున్నట్లుగా శక్తిహీనంగా మారింది శరీరం. కాళ్లు నీరసంతో లొటలొటలాడాయి.

"ఇంకా మీరదృష్టవంతులే పాపా... ఈమధ్య పత్తి తోటల్లో పనికెళ్లిన ఇద్దరు ముగ్గురు పనివాళ్లకి ఇలాగే జరిగి ప్రాణాలే



పోయాయి తెలుసా?" చెప్పాడు డాక్టర్ బాబు.

గజగజ వణికింది ముత్తి. "నిజమే...తమ అదురుష్టం బాగుండి తమ్ముడికేం గాలా... ఆడికేటన్నా అయ్యుంటే... ఇదంతా తను మైక్‌సెట్ కోసం ఆతరపడబట్టే అయ్యింది...ఇక జలములో ఆపాడు పాటల ఊసె త్తదు...తన తమ్ముడికన్నా తనకేటీ ఎక్కువ కాదు..." కారు తున్న కన్నీళ్లను తుడుచుకొని ఇంటికెళ్లింది ముత్తి.

* * *

పెళ్లి ముహూర్తాజుల్లోకి వచ్చింది. కొంప బేరం పెట్టడానికి కూడా వీల్లేక..కాగితాలు సావుకారమ్మ దగ్గర తనఖా పెట్టి మరొక అయిదువేలు అప్పు తెచ్చాడు వీరయ్య. తల్లిదం డ్రులు పడుతున్న అవస్థ అంతా చూస్తూనే ఉంది ముత్తి.

పరిస్థితులను అర్థం చేసుకోకుండా, పెళ్లి కోసం తొందర చేస్తున్న మేనత్తమీద పీకల్దాకా కోపమొచ్చింది దానికి.

ఆ సాయంత్రం గుడిసె బయట చెట్టు కింద విషా దంగా కూర్చున్న ముత్తి దగ్గరకు పక్కింటి వరాలు వచ్చి "ఏటే ముత్తీ అలా కూసున్నావు... అప్పుడే మొగుడి మీదకి గాలి మళ్లిందా..." అంది హాస్యంగా.

"అదేటి నేదుగాని... ఏటిలా వచ్చావప్పా" ప్రశ్నించింది ముత్తి.

"కుమ్మరి కానా కాడ ఏదో సినిమా ఏత్తన్నారంట. ఆడ మగ అందరూ తప్పనిసరిగా సూడాలని మన ఎన్నమ్మ లేదూ...ఆవిడ సెప్పింది. ఓ పాలి అలా ఎళ్లొద్దాంరా..." అంటూ చేయి పట్టి లాక్కుపోయింది వరాలు.

పల్లె ప్రాంతాల్లో పెరిగిపోతున్న మాతా-శిశు మరణా లను దృష్టిలో ఉంచుకొని, ఆరోగ్య శాఖవారు ప్రదర్శిస్తున్న డాక్యుమెంటరీ చిత్రం అది.

వయస్సు రాకుండా, ఆడపిల్లలకు పెళ్లి చేస్తే... తద్వారా వచ్చే దుష్పరిణామాలను వివరిస్తూ... ఆడపిల్లలకు పద్దె నిమిది దాటాక గానీ పెళ్లి చేయకూడదని చెప్పారు ఆఖర్లో.

పసి వయసులో పెళ్లి చేయడం వలన...ఎదిగీ ఎదగని అవయవాలతో ఉన్నవారు ఆ చిన్న వయసులోనే తల్లులు కావడం మూలాన ఎన్ని అనర్థాలు జరుగుతు న్నాయో సోదాహరణంగా వివరించారు.

అంతా చూసిన ముత్తి మనసులో సంఘర్షణ మొద లైంది.

ఆమెకేం చేయాలో తోచక అగమ్య గోచరంగా ఉంది. "ఇప్పుడు తాను పెళ్లి సేసుకొని ఎలిపోతే అమ్మ, అయ్యల పరిత్తితి ఏటి? ఉన్న కొంప కాత్తా తనకా పెట్టి తిరి. ఆ అప్పు తీరసలేకపోతే... ఆ ఇల్లు కూడా పోతాది. ఆ నీడ కాత్తా పోతే ఆల్లేటకి పోతారు... ఆళ్లకి సాయపడ్డానికి సిరంజీవి కూడా సదువు మానేసి మళ్లీ కూలికి పోతాడు... సదువుంటే ఏదైనా సెయ్యొచ్చు...తన బంగారు తమ్ముు" పెద్ద సదూ సదూకొని మంచి ఉద్యోగం సేయాల...అదే తన కోరిక... తను పెళ్లి సేసుకొని ఆళ్లందరినీ బజారుకీడ్స నేదు..." అనుకుంది. ఆ రాత్రంతా ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది ముత్తి.

దాని కళ్ల ముందు డాబుగా, మంచి బట్టలేసుకొని కాలుమీద కాలు వేసుకుని ఉద్యోగం చేస్తున్న చిరంజీవి మెదులుతున్నాడు.

* * *

"ఏటే...మతిగాని పోనాదేటి నీకు? ఎల్లుండి పెళ్లి పెట్టు కొని ఏటా మాటలు? ఎవ్వరైనా ఇంటే నవ్వి పోగలు..." కూతురు చెప్పిన మాటలు విని అంతెత్తున ఎగిరిపడింది పేరమ్మ.

"నాకేటీ మతిపోనేదు...ఇప్పుడే బుద్దొచ్చినాది. మరో అయిదారేళ్ల వరకు పెళ్లి వూసే నేదు" చెప్పింది ముత్తి నిర్లక్ష్యంగా తలెగరేసి.

పేరమ్మకి మండుకొచ్చింది. "నోర్ముయ్ దెట్టగుంటా... దెయ్యం గాని పట్టినాదేటి నీకు..అలా పేల్తున్నావు... పిచ్చి పిచ్చి ఏసాలేత్తే నరికిపోగులెడతా..." గావుకేకలు పెట్టింది పేరమ్మ.అవేవీ ఖాతరు చేయనట్లుగా అద్దం ముందు నుంచుని జెడ వేసుకుంటూ... "నువ్వు కొట్టినా సరే... కోసినా సరే...నానీ పెళ్లి సేసుకోనంతే..." ఖండితంగా చెప్పే సింది ముత్తి.

"ఓలమ్మో...దీనికేదో అయ్యినాది..అసలే వొదిన మా సెడ్డ నికారుసయిన మడిసి... దీనేలకం గాని సూసిం దంటే ఇంతే సంగతులు..." గగ్గోలు పెట్టింది పేరమ్మ.

అంతవరకు ప్రేక్షకుడిలా వీళ్ల వాదన వింటున్న వీరయ్య కల్పించుకుంటూ...

"నువ్వూరికే ఎర్రెత్తి పోమాక..." అని పెళ్లాన్ని గదిమి...కూతురి వైపు తిరుగుతూ

"ఏటీ తల్లీ... మొన్నటి వరకు బాగానే ఉన్నావు గందా... ఇంతలో ఏటీ యిసిత్రం..." అని అనునయంగా అడి గాడు."అది గాదయ్యా... నేను కోరిన పాడు కోర్కె మూలాన బంగారం నాంటి తమ్ముడు మంచాన పడ్డాడు... నా పెళ్లి కోసం సావుకారమ్మ దగ్గర తెచ్చిన సొమ్మంతా ఆడి వొయిద్యానికే సరిపోనాది...మళ్లీ నా పెళ్లి కోసమని ఈ కొంప తాకట్టెట్టి డబ్బులు తెచ్చావు" ఆ అప్పు తీరసనేక... ఈ కొంప అమ్ముకొని నువ్వు ఈదిన పడితే నానెట్టా బరింసగలనయ్యా..." బావురుమంది ముత్తి.

"అమ్మా...ముత్తీ..." ఆర్తిగా అన్నాడు వీరయ్య.

"అవునయ్యా...మీరిద్దరూ కట్టం సేత్తే గాని ఆ బాకీ సెల్లుబాటు గాదు. మీ బాధ సూత్తూ తమ్ముడుండలేడు. బడి మానేసి కూలికి పోతాడు...అట్టా జరగడం నాకిట్టం నేదు..ఆడు బాగా సదవాల...సదివి పెద్ద ఉద్యోగం సేసి మిమ్మల్ని సుఖపెట్టాల...ఆడు నా కోసమని ఆడి పేనాలే నెక్క సేయలేదు...నానాపాటి సేయలేనా...అందుకే సెప్తున్నా...ఇల్లు తాకట్టెట్టి తెచ్చిన సొమ్ము తిరిగి జమేసేసి ఆ కాగితాలు ఒట్టుకురా అయ్యా.." చెప్పింది ముత్తి గద్గ దస్వరంతో.

పేరమ్మ గుండె కరిగి నీరవ్వగా అలా ముత్తినే చూస్తుం డిపోయింది.

"ఒలే ముత్తీ...ఎంత పెద్దమనుసే నీది...తమ్ముడు సదూకోడం కోసం నువ్వు పెళ్లి మానుకుంటావా..." కూతుర్ని ఒక్క అంగలో సమీపించి గుండెకి హత్తుకుంది పేరమ్మ.

తల్లి కౌగిట్లో ఒదిగిపోయింది ముత్తి. ఆప్యాయంగా ఆమె వీపు నిమిరింది పేరమ్మ. ఏదో గుర్తొచ్చినట్లుగా "అంతా బానే ఉంది గాని...పీటల కాడి కొచ్చిన పెళ్లి ఆపేత్తే మీ అత్త కోపంతో మండిపడదా మరి! ఆళ్లకే సమా ధానం సెప్పాల" అంది భయపడుతున్నట్లుగా.

"ఏమన్నాగానీ...మరో అయిదేళ్లవరకు ఆగితే సరే.... నేక పోతే ఇంకో పిల్లని సూసుకోమను...అంతేగానీ నానీ పెళ్లి సేసుకోను..అదీగాక రేతిరి కుమ్మరికానా కాడ ఏసిన సిని మాలో సిన్నపిల్లలకు పెళ్లిళ్లు సేయకూడదని సూపిం చారు. దాని వలన ఎన్నో కట్టాలొత్తాయంట... అందుకే నాకీ పెళ్లొద్దు..." అంది ముత్తి మహాజ్ఞానిలా ఫోజు పెడుతూ.

"నిజమే పేరమ్మా...ముత్తి చెప్పినదే కరెక్ట్...మనసు, శరీరం రెండూ వికసించని వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం మహా నేరం. దానిష్ట ప్రకారమే కొన్నాళ్లాగి పెళ్లి చేయండి..." చెప్పింది అప్పుడే చిరంజీవిని చూద్దామని అక్కడికి వచ్చిన టీచరమ్మ.

వీరయ్య కూడా ఆమెనే బలపరిచాడు. పేరమ్మ ఆలోచ నలో పడింది...ముత్తి మాటలు ఆమెలోని జ్ఞానచక్షువు లను మేల్కొలిపాయి.

"సరే..నీ మాటెందుకు కాదనాల...మీ అత్తతో మాటాడి సూద్దాం. కాదు కూడదంటే మరో సమ్మందం ఎతుక్కో మని సెప్దాం..సరేనా..." ప్రేమగా అడిగింది పేరమ్మ.

ముత్తి ముఖం విప్పారింది రవికిరణాలు సోకిన కమల మల్లే..ఆనందం పట్టలేక చిరంజీవిని ఎత్తుకొని గిరగిరతి ప్పింది.

"అక్కా... నువ్వు పెళ్లి చేసుకోవా..." ఈ తతంగమంతా అర్థంకాని చిరంజీవి అమాయకంగా ప్రశ్నించాడు.

"సేసుకుంటా...కానీ ఉప్పుడు కాదు...

నా కోర్కె తీరసడానికి ఆ యములోడి దగ్గరకెళ్లొచ్చావు.... నానీ పెళ్లి సేసుకొని మరోపాలి నిన్నాడికి పంపలేను. నువ్వు సక్కా సదూకొని...గొప్పగా తయారైనప్పుడు తప్ప కుండా నాను పెళ్లి సేసుకుంటాను.

సదూకుంటావా సెప్పు?" అడిగింది ముత్తి వాడిని నేల మీదికి దించుతూ.

చిరంజీవి హుషారుగా చూస్తూ "తప్పకుండా చదువు కుంటానక్కా... బాగా చదివి నీ పెళ్లి నేనే చేస్తా.." అన్నాడు ఆరిందాలా.

"ఒరే తమ్ముా...అప్పుడు మనింటి ముందు... మైక్‌సెట్టె ట్టించాల...ఎట్టిత్తావా..." పగలబడి నవ్వింది ముత్తి తెరలు తెరలుగా.

ఆ నవ్వుల ధ్వని పరిసరాల్లో మారుమోగి, వేపచెట్టు మీద గుంపుగా కూడిన కాకులన్నీ ఒక్కసారిగా చెదిరి ఎగి రిపోయాయి. 'కావు..కావు' మని గోల చేస్తూ.

స్వేచ్ఛావిహంగాలకు మల్లే పరుగులు దీస్తున్న బిడ్డల్ని తృప్తిగా చూసుకున్నారు వీరయ్య, పేరమ్మలు.